# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-03-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **కీలక రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు, సమర్థ సేవలందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. గేట్స్ ఫౌండేషన్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.**
2. **తెలంగాణలో ప్రతి పౌరునికి విద్య, ఆరోగ్యం, ఉపాధి, సామాజిక భద్రత అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టంచేశారు.**
3. **డిజిటల్ చెల్లింపుల లావాదేవీల్లో వినియోగదారులు, చిరువ్యాపారులకు ఉపయుక్తమయ్యేలా 1500 కోట్ల రూపాయల విలువైన ప్రోత్సాహక పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.**
4. **ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికి 31 వేల 600 కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు.**
5. **రాష్ట్రంలో పారిశ్రామిక పునరుజ్జీవన చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు.**

==========================

కీలక రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు, సమర్థ సేవలందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి గేట్స్ ఫౌండేషన్ సహకారం అందించనుంది. రాష్ట్రంలో వైద్యం, ఆరోగ్యం, మెడ్‌టెక్, విద్య, వ్యవసాయ రంగాల్లో ఎదురవుతున్న సవాళ్లకు కృత్రిమ మేధ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో సమిష్టి కార్యాచరణ ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ నిర్ణయించాయి. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిన్న ఢిల్లీలో, గేట్స్ ఫౌండేషన్ అధినేత బిల్ గేట్స్‌తో సమావేశమయ్యారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

--------------------------

తెలంగాణలో ప్రతి పౌరునికి విద్య, ఆరోగ్యం, ఉపాధి, సామాజిక భద్రతను అందించే స్థాయికి రాష్ట్రాన్ని తీసుకెళ్లడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క స్పష్టంచేశారు. శాసనసభలో నిన్న ఆయన 3 లక్షల 4 వేల 965 కోట్ల రూపాయల అంచనాతో రాష్ట్ర 2025-26 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా విక్రమార్క మాట్లాడుతూ.. రాబోయే పదేళ్లలో తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే కార్యాచరణ సాగుతోందని వెల్లడించారు.

--------------------------

డిజిటల్ చెల్లింపుల లావాదేవీల్లో వినియోగదారులు, చిరువ్యాపారులకు ఉపయుక్తమయ్యేలా 1500 కోట్ల రూపాయల విలువైన ప్రోత్సాహక పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీని కింద 2 వేల రూపాయల లోపు చిన్న మొత్తాల యూపీఐ లావాదేవీలకు వ్యాపారి రాయితీ రేటును కేంద్ర ప్రభుత్వమే భరించనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన నిన్న జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపిందని కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. దేశంలో పాల ఉత్పత్తిని పెంచడంతో పాటు పాడి పరిశ్రమకు అవసరమైన ఆధునిక మౌలిక వసతుల కోసం రాష్ట్రీయ గోకుల్ మిషన్, నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ డెయిరీ డెవలప్‌మెంట్ పథకాల ద్వారా చేపడుతున్న వివిధ కార్యక్రమాలకు అదనంగా 2వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించిందని ఆయన తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికి 31 వేల 600 కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శాసనమండలిలో సభ్యుల ప్రశ్నకు నిన్న ఆయన సమాధానమిస్తూ.. రాజధానికి ఖర్చు పెట్టే నిధులన్నింటినీ కేంద్ర ప్రభుత్వం సహా వివిధ బ్యాంకుల నుంచి రుణంగా తీసుకుంటున్నామని చెప్పారు. అమరావతికి రైల్వే ట్రాక్‌ను కేంద్ర ప్రభుత్వమే నిర్మిస్తుందని, ట్రాక్ ఏర్పాటుకు భూ సేకరణ రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సి ఉంటుందని మంత్రి వెల్లడించారు. ప్రజలు చెల్లించిన పన్నుల్లో పైసా కూడా అమరావతికి ఖర్చు చేయొద్దని ముఖ్యమంత్రి ఆదేశించారని నారాయణ వివరిస్తూ..

**....వాయిస్.... 30 సెకన్లు....**

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి నియోజకవర్గానికి 100 పడకల మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిని ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో నిర్మించనున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల్లో.. రాష్ట్రంలో సూపర్ స్పెషాలిటీ వైద్యశాలల కొరతపై చర్చ సందర్భంగా మంత్రి నిన్న మాట్లాడారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో వైద్యుల కొరత ఉందని... 300 మంది వైద్యుల నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చామని చెప్పారు. ఇన్‌సర్వీస్ కోటాలో మరో 300 మంది వైద్యులు అందుబాటులోకి వస్తారని సత్యకుమార్ వెల్లడించారు.

---------------------------

భారత్‌ను అంతర్జాతీయ వినోద రంగానికి కేంద్రంగా మార్చేందుకు, వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్ టెయిన్ మెంట్–వేవ్స్ 2025 సదస్సును ముంబైలోని జియో వరల్డ్ గార్డెన్స్‌లో మే 1 నుంచి 4వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించనుంది. దేశంలో మీడియా–వినోదరంగం అభివృద్ధి, వాణిజ్యపరమైన అవకాశాలను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా సృజనాత్మకత, ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో. "క్రియేట్ ఇన్ ఇండియా" పేరుతో 31 అంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నారు.

..ప్రోమో...

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక పునరుజ్జీవన చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. కృష్ణాజిల్లా మల్లవల్లి పారిశ్రామికవాడలో అశోక్ లేలాండ్ బస్సుల తయారీ

ప్లాంట్‌ను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. తయారీ రంగంలో పెట్టుబడులకు గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్‌ను మారుస్తున్నామని చెప్పారు. గడిచిన 9 నెలల్లో 7 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని, 4 లక్షల ఉద్యోగాలు రాబోతున్నాయని మంత్రి వివరిస్తూ..

**....వాయిస్.... 33 సెకన్లు....**

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఇంటర్మీడియేట్ పరీక్షల్లో భాగంగా ఈరోజు ఇంటర్ ద్వితీయ సంవత్సరం మోడరన్ లాంగ్వేజ్–పేపర్ 2, జాగ్రఫీ పేపర్ –2 పరీక్షలకు సెట్ నెం. **2** ను ఎంపిక చేశారు.

కాగా.. తెలంగాణాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం కామర్స్ –పేపర్ 2, కెమిస్ట్రీ –పేపర్ 2 పరీక్షలు జరుగుతాయి.

---------------------------

2025–26 వార్షిక బడ్జెట్‌కు ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఆమోదం తెలిపింది. ద్రవ్య వినిమయ బిల్లును ఆమోదం కోసం ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ నిన్న సభకు సమర్పించారు. ఏకగ్రీవంగా ఎలాంటి చర్చ లేకుండా బిల్లుకు సభ్యులు ఆమోదం తెలిపారు. దీంతో ద్రవ్య వినిమయ బిల్లు సభ ఆమోదం పొందిందని ఉప సభాపతి కె.రఘురామకృష్ణరాజు ప్రకటించారు. కాగా, ద్రవ్యవినిమయ బిల్లుతో పాటు మహానగర ప్రాంత, పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థల బిల్లు, ప్రైవేటు విశ్వవిద్యాలయాల బిల్లు, ఉపాధ్యాయుల బదిలీల క్రమబద్ధీకరణ బిల్లుకు శానమండలి ఆమోదం తెలిపింది.

---------------------------

ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ పథకం కింద ఆంధ్రప్రదేశ్ నుంచి 11 లక్షల 56 వేల దరఖాస్తులు వచ్చాయని కేంద్ర పునరుత్పాదక ఇంధనశాఖ సహాయమంత్రి శ్రీపాద్ యశోనాయక్ తెలిపారు. నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. ఈ నెల ఒకటవ తేదీ వరకు రాష్ట్రంలో 14 వేల 86 ఇళ్లపై సౌర విద్యుదుత్పత్తి ప్యానళ్లు ఏర్పాటు చేశామని చెప్పారు. ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌లో 11 వేల 623 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటయ్యాయని శ్రీపాద్ యశోనాయక్ వివరించారు.

---------------------------

సూక్ష్మ, చిన్న. మధ్య తరహా పరిశ్రమల సమాచారం అందరికీ అందుబాటులో ఉంచేందుకు జిల్లా కేంద్రాల్లో నాలెడ్జ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఎంఎస్ఎంఈల ద్వారా ఎగుమతులు పెంచే లక్ష్యంతో నీతి అయోగ్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు విశాఖపట్నంలో నిన్న అవగాహన సదస్సు నిర్వహించింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ.. విజన్ డాక్యుమెంట్–2030 ప్రకారం లక్ష్య సాధనకు ప్రతి జిల్లా, నియోజకవర్గం, మండల కేంద్రానికి ప్రత్యేక విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తామని వెల్లడించారు.

=====================